క్లుప్తంగా

ఆహార అలవాట్లపై అవగాహన

రామసముద్రం: మండలంలోని మాలేనత్తం పంచాయతీ ఉప్పినెల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మహోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఆరోగ్య ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల పురుషుల భాగస్వామ్యం గురించి వివరించారు. వెయ్యి రోజుల్లో మెదడు అభివృద్ధి పై సలహాలు సూచనలు ఇచ్చారు.

ఎంపీడీఓకు సత్కారం

బి.కొత్తకోట: ఉద్యోగోన్నతిపై బి.కొత్తకోట ఎంపీడీఓగాట బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ షుకూర్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించి అభినందలు తెలిపారు. ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, వైస్ఎంపీపీ ఖాదర్‌వలీ, ఎంఈవో రెడ్డిశేఖర్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ఎరువుల దుకాణాలు

–డీఆర్ రోషన్‌జమీర్

మదనపల్లె: డివిజన్‌లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఎరువుల దుకాణాలు మంజూరు చేస్తున్నట్టు సహకారశాఖ మదనపల్లె డిప్యూటీ రిజిస్ట్రార్ బి.రోషన్‌జమీర్ చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఒక ప్రాథమిక సహకార సంఘం ఉందని చెప్పారు. ఈ సంఘ నిధులతో ఎరువుల దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా మరింత బలపడేలా చేపట్టిన చర్యల్లో భాగంగా ప్రభుత్వం లైసెన్సులను జారీ చేస్తోందని చెప్పారు. లైసెన్సులు పొందిన వెంటే దుకాణాలను ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. వీటికి అవసరమైన ఎరువులు, పురుగుమందులను ఇఫ్కో, మార్క్‌ఫెడ్ సరఫరా చేస్తాయని చెప్పారు. బి.కొత్తకోట, కలిచర్ల, పీటీఎం, ములకలచెరువు, తంబళ్లపల్లె, కురబలకోట, రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె రూరల్, పీలేరు, వాయల్పాడు, గుర్రంకొండ, కేవీ.పల్లె, కలికిరి, కలకడ మండలాల్లో ఎరువుల దుకాణాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

వాటర్‌షెడ్ పనుల అవకతవకలపై విచారణ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మడుమూరు పంచాయతీలో చేపట్టిన వాటర్‌షెడ్ పనుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వాటర్‌షెడ్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డినే స్వయంగా పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు. వాటర్‌షెడ్‌లో క్షేత్ర స్థాయిలో పని చేసే కింది స్థాయి సిబ్బంది ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి పనులు చేసే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై రూ.లక్షల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, డ్వామా పీడీ ఆదేశాల మేరకు ఏపీడీ లక్ష్మీ నరసయ్య శుక్రవారం పీవోతో పాటు స్థానికంగా పని చేసే కింది స్థాయి సిబ్బందిని విచారించారు. గొడవలు పడకుండా ఒకరికొకరు సామరస్యంగా కలసి మెలసి సర్దుకు పోవాలని చైర్మన్‌కు సూచిస్తూ ఏపీడీ రాజీ యత్నాలు చేసినట్టు సమాచారం. ఈ విషయంపై ఏపీడీని వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా చెరువులు, కుంటల్లో చేపట్టిన పనులకు ఎలాంటి బిల్లులు మంజూరు కాకుండా నిలుపుదల చేసామన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు దారుణం

వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరనాథ్‌రెడ్డి



పీలేరు రూరల్ : మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా బాలకృష్ణ దుర్భాషలాడటం యావత్ ఆంధ్రప్రదేశ్‌కు సిగ్గు చేటన్నారు. పార్టీలపై విద్వేషాలు ఉన్నంత మాత్రాన తన స్థాయి మరచి చౌకబారు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. శాసనసభలో లేని వ్యక్తి గురించి ఇలా మాట్లాడడం తగదన్నారు. ఇప్పటికైనా బాలకృష్ణ తన తప్పు తెలుసుకుని తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ పురోగతి సూచిక 2.0పై శిక్షణ

రామసముద్రం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన ఎంపీడీఓ లతీఫ్ ఖాన్ ఆధ్వర్యంలో పంచాయతీ పురోగతి సూచిక 2.0 కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, ఎంపీటీసీలకు అన్ని శాఖల అధికారులకు గ్రామ స్థాయి అభివృద్ధిని ప్రోత్సహించడానికి, గ్రామ పంచాయతీల పనితీరును మెరుగుపరచడానికి పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు మౌలిక వసతులు వంటి 9 అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ గఫూర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఎంపీటీసీలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఐసిడిఎస్ అధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీకి మనసారా పూజలు

ఘనంగా ఐదోరోజు శరన్నవరాత్రి ఉత్సవాలు

మదనపల్లె సిటీ: శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి నామస్మరణ మార్మోగుతోంది. జగజ్జని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అమ్మవార్లు వివిధ అలంకారల్లో భక్తులను కటాక్షించారు. అమ్మవారిని కనులారా దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన శుక్రవారం స్తోత్రాలు, సహస్రనామాలతో కొలిచారు. మదనపల్లె పట్టణంలో అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.శుక్రవారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు. స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్థానిక వాసవీభవనవీధి, నెహ్రూబజార్, కోటవీధి, ఆర్‌ఆర్‌వీధి, సిపాయివీధి నుంచి మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిశాలలో శ్రీమహాలక్ష్మి అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. అమ్మవారి అలంకరణ భక్తులకు ఆకట్టుకుంది. సేలంకు చెందిన కళాకారులు అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు. త్రిపురాంబ గ్రూపు ఆధ్వర్యంలో ముత్యాల లక్ష్మీదేవి అలంకరణతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితత్రిపుర సుందరిదేవి ని రాజశ్యామల అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో ఉదయం అర్చకులు సతీష్‌శర్మ అభిషేకాలు,హోమాలు నిర్వహించారు. అమ్మవారు వెండి కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. వీవర్స్‌కాలనీ మహిళలు భక్తులకు పసుపు,కంకుమ,గాజులు అందజేశారు. దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మహాలక్ష్మి అలంకారంలో దర్శనం కల్పించారు. స్థానిక కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మను అర్ధనాశ్వర్వారి అలంకారం చేశారు.

చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు

రామసముద్రం : మండలంలోని గుంతయంబాడి గ్రామంలోని శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే శ్రీలక్ష్మి జనార్థన స్వామి, వాలీశ్వర కొండపై పార్వతి దేవి, తిరుమల రెడ్డిపల్లిలోని శ్రీ మారెమ్మ, గుంతలపేటలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి, మూగ ఎర్రప్పల్లిలోని శ్రీ పటాలమ్మ ఆలయాల్లో దసరా పూజలు వైభవంగా నిర్వహించారు.

మహాలక్ష్మి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెడ్డెమ్మతల్లితో పాటు గ్రామదేవతలైన గంగమ్మ తల్లి, పోలేరమ్మతల్లి, శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు మహాలక్ష్మీదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను రంగు రంగుల పుష్పాలతో, పట్టుచీరెలు, దివ్యాభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. పలురకాల నైవేద్యాలు సమర్పించారు.



మదనపల్లె : కోర్టు గంగమ్మ ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

మహాలక్ష్మీగా ఎల్లమ్మ దర్శనం

కలికిరి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం గ్రామదేవత ఎల్లమ్మ భక్తులకు మహాలక్ష్మీగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం రూ.వంద, రెండొందల రూపాయల కొత్త నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. మహాలక్ష్మీగా దర్శనమిచ్చిన ఎల్లమ్మను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. పట్టణంలోని పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్టించిన సప్తమాత్రుక దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, రాత్రి లలిత సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు.

లాభాల గంగమ్మకు వసంతోత్సవం

కలికిరి(వాల్మీకిపురం): పట్టణ పరిధిలోని జగనన్న కాలనీలో వెలసిన లాభాల గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ఉదయం వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం అభిషేకం నిర్వహించి మహాలక్ష్మీ అలంకారం చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మహాలక్ష్మీ అలంకరణలో రౌద్రాల అంకాలమ్మ

పీలేరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శుక్రవారం స్థానిక మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి లక్ష్మీదేవి అలంకరణ, పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకం నిర్వహించి మోహినీ అలంకరణ చేశారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



కలికిరి: మహాలక్ష్మీగా దర్శనమిస్తున్న ఎల్లమ్మ



మదనపల్లె: వెండికవచ అలంకారంలో చౌడేశ్వరిదేవి



కలకడ: ధనలక్ష్మీగా గుడిబండ బోయకొండ గంగమ్మ



గుర్రంకొండ: మహాలక్ష్మీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి



రామసముద్రం : ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి



ములకలచెరువు: గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు



వాల్మీకిపురం:మహాలక్ష్మీ అలంకరణలో లాభాల గంగమ్మ



పీలేరు :మహాలక్ష్మీ అలంకరణలో రౌద్రాల అంకాలమ్మ

చౌడేశ్వరిదేవికి విశేష పూజలు

కేవీపల్లె : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చీనేపలెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మహాలక్ష్మీదేవికిగా సప్పలమ్మ

మదనపల్లె సిటీ: దసరా ఉత్సవాల్లో భాగంగా మదనపల్లె మండలం సిటీఎం క్రాస్‌రోడ్డులో వెలసిన శ్రీ సప్పలమ్మఆలయంలో శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ముస్లిం మహిళలు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి సారె ,చీర అందజేశారు.

ధనలక్ష్మిగా శ్రీబోయకొండ గంగమ్మ

కలకడ : దశరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కలకడ, గుడిబండ, కోన, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె గ్రామాలలో వెలసిన గ్రామదేవత శ్రీచౌడేశ్వరిదేవిని సంతానలక్ష్మిగా, అలాగే గుడిబండ గ్రామంలో శ్రీబోయకొండ గంగమ్మను ధనలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొగటవీరక్షత్రియులు ప్రత్యేక అలంకరణ చేసి, ఖడ్గపద్యాలు పలికి, అభిషేకం, పూజలు చేశారు.

గజలక్ష్మి అలంకారంలో..

ములకలచెరువు: ములకలచెరువులో ఆర్యవైశ్యుల కుల దేవత వాసవీ మాతను శుక్రవారం గజలక్ష్మి అలంకారంలో అమ్మవారిని అలంకరించారు. ప్రత్యేక పూజలతో సేవించారు.

28న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

మదనపల్లె రూరల్ : మాలల జేఏసీ, మాల ఉద్యోగుల సంఘం, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న కుప్పం నుంచి ఇచ్చాపురం వరకు ప్రారంభమైన పాదయాత్ర 28వ తేదీ ఆదివారం ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందని మాలమహానాడు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం అన్నారు. శుక్రవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...భారత రాజ్యాంగం మనువాదుల చేతుల్లో బందీ కాబోతుందన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయంగా ఉన్న భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి పాలకులు మనువాద రాజ్యాంగం అమలుకు కృషి చేస్తున్నారన్నారు. వర్గీకరణ పేరుతో మాలమాదిగలను నిట్టనిలువునా చీల్చారన్నారు. ఈ పరిస్థితిలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అంబేద్కర్‌వాదులపై ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న పాదయాత్రకు మాలలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు గుండామనోహర్, యమలా చంద్రయ్య, మల్లెలమోహన్, హరి, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యమలా సుదర్శనం

వైఎస్సార్ సీపీతోనే మైనారిటీల సంక్షేమం

– సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : వైఎస్సార్ సీపీతోనే మైనారిటీల సంక్షేమం సాధ్యమని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేంపల్లె గ్రామంలో పర్యటించిన ఆయన మైనారిటీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైనారిటీలకు జరిగిన మేలును, అందిన సంక్షేమాన్ని గుర్తుచేశారు. మైనారిటీల సంక్షేమానికి దివంగత మహానేత డాక్టర్.వైఎస్సార్, 4శాతం రిజర్వేషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలతో మేలు చేశారన్నారు. తర్వాత వైఎస్సార్ కుమారుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, తండ్రి కంటే మరింతగా మంచి చేసి ముస్లిం పక్షపాతిగా పేరుతెచ్చుకున్నారన్నారు. కూటమిప్రభుత్వం 15నెలల పాలనలో ప్రజలను మోసగించడం తప్పితే చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం రాష్టంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రశ్నించే గొంతులను నొక్కుతోందన్నారు. ఎక్కడికక్కడ అణిచివేసే ధోరణితో పనిచేస్తోందన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడం మనందరి ప్రధాన కర్తవ్యమన్నారు. అనంతరం వేంపల్లె మస్జిద్–ఏ–సిద్ధిక్‌లో నమాజు ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అల్లాబక్షు, రహీమ్‌సాబ్, ఇనాయతుల్లా, యూనస్, నూర్ మొహిద్దీన్, జబీవుల్లా, ఖిజార్‌ఖాన్, జైనుద్దీన్, సత్తార్, ఫకృద్దీన్, యాసిన్, అబ్దుల్లా, రియాజ్, ఫయాజ్, నాసిర్, నవాజ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



వేంపల్లె గ్రామంలో ముస్లిం సోదరులతో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

సురక్షిత కాన్పు ప్రతి గర్భిణి హక్కు

గుర్రంకొండ: సురక్షితమైన కాన్పు చేయించుకోవడం ప్రతి గర్భిణి హక్కు అని జిల్లా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మరఫీ అన్నారు. శుక్రవారం మండలంలోని రామాపురంలో స్వస్థ నారీ–స్వశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భవతులకు సురక్షితమైన కాన్పులు చేస్తారని అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక వసతులను కల్పించందన్నారు. గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా రాగిజావా, బెల్లం చెక్కిలు, కోడిగుడ్లు ఇస్తున్నామన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకొంటే జేఎస్వై పథకం కింద రూ. వెయ్యి, జననీ సురక్ష యోజనా పథకం కింద రూ. వెయ్యి, ఎంఎంవీవై పథకం కింద రూ. 5 వేలు ఇస్తారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆనంతరం స్వస్థనారీ కార్యక్రమ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప, సర్పంచ్ ఆనంద, ఎంపీహెచ్ఈవో హరినాథ్,టీబీ పర్యవేక్షులు నాగిరెడ్డి, సూపర్‌వైజర్ మాధవి, ఏఎన్ఎమ్‌లు మద్దమ్మ, అస్వనీ, శ్రీలత, గంగులమ్మ, తేజుకలు పాల్గొన్నారు.



స్వస్థనారీ కార్యక్రమ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

సమష్టి కృషితోనే అభివృద్ధి

తంబళ్లపల్లె: గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమిష్టిగా కృషి చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ థామస్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఓన్ రీసోర్సు రెవెన్యూ అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావులు అభివృద్ధి ప్రణాళిక, సుస్థిర అభివృద్ధి, సుపరిపాలన, ఆరోగ్యం, తాగునీటి సరఫరా, పచ్చదనం, పరిశుభ్రత అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆదాయ వనరులు గుర్తించి అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు.

హంద్రీ-నీవా జలాలు విడుదల చేయాలని వినతి

మదనపల్లె రూరల్ : పట్టణం, పరిసర ప్రాంతాల్లోని చెరువులకు హంద్రీ–నీవా జలాలను విడుదల చేయాలని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో చెరువులకు హంద్రీనీవా జలాలను మళ్లించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ... హంద్రీనీవా జలాలను చెరువులకు మళ్లించడం వల్ల భూగర్భజలాల పెంపు జరుగుందని, వేసవిలో సాగు,తాగునీటి అవసరాలకు కొరత లేకుండా ఉంటుందన్నారు. పర్యావరణ సమతుల్యత పెరుగుతుందన్నారు. వర్షాభావం కారణంగా స్థానికంగా నీటి ఎద్దడి నెలకుందని, హంద్రీనీవా కాలువలో వెళుతున్న కృష్ణా జలాలను స్థానిక ప్రజలు, రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలానిబాషా, సద్దుల హరికుమార్, వినయ్‌కుమార్, బాలకృష్ణ, కార్తీక్, ఉదయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

పీలేరు రూరల్ : గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ మెన్‌లు, ఎలక్ట్రీషియన్ల సేవలు అభినందనీయమని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సమావేశంలో గ్రామ పంచాయతీ కార్మికుల సేవలకు వెలకట్టలే మని తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజారోగ్యామే ధ్యేయంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు మల్లికార్జునరెడ్డి, శ్రీనాథరెడ్డి, ఉదయ్‌కుమార్, అబీద్, నాగరాజనాయక్, సచిన్, కాలేషా, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో వ్యాధుల నియంత్రణ

పీలేరురూరల్ : ముందస్తు పరీక్షలతో వ్యాధులను నియంత్రించవచ్చునని రేగళ్లు, తలపుల పీహెచ్‌సీల వైద్యాధికారి రాధామాదవి, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ శ్రీగిరీష అన్నారు. శుక్రవారం మండలంలోని బాలంవారిపల్లె, గూడరేవుపల్లెలో స్వస్థ్ నారి సశక్తి పరివార అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

– డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు

మదనపల్లె రూరల్ : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య(వెలుగు) కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని 15 మండలాల క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ...డిజిటల్ లావాదేవీలు మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకువస్తాయని, ఆన్‌లైన్ ద్వారా రుణాలు పొందడం, ప్రభుత్వ సహాయాన్ని అందుకోవడం సులభతరమవుతుందన్నారు. మహిళా సంఘాల సభ్యుల సామాజిక భద్రత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, బ్యాంకులు అందిస్తున్న రుణాలు, బీమా పథకాలపై పూర్తిస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మీప్రసాద్, ఏరియా కోఆర్డినేటర్ సాంబశివ, జిల్లా సమాఖ్య లీడర్స్ జి.మంజు, ఎస్.అలివేలు, లీగల్ కోఆర్డినేటర్ గంగాధర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న పీడీ నాగేశ్వరరావు

అక్టోబర్ 1 నుంచి ఆన్‌లైన్ వర్కులు చేయలేము..

5జీ మొబైల్స్ ఇచ్చేవరకు, అక్టోబర్ 1 నుంచి ఆన్‌లైన్ వర్కులు చేయలేమని ఏపీ వెలుగు వీఓఏ(యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం నాయకులు దివ్యజ్యోతి, రాణి, జి.రెడ్డెప్పరెడ్డి, రామాంజులు, సుబ్రహ్మణ్యంలు పీడీ నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఆన్‌లైన్ వర్కులు చేయలేదని వీఓఏలపై వేధింపులు జరుగుతున్నాయని, 5జీ మొబైల్స్ ఇచ్చేవరకు చేయలేమని తెలిపారు. అలాగే వీఓఏల చిరకాల సమస్యలను పరిష్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు.

మిట్స్ ఎస్ఏసీ కార్యవర్గం ఎంపిక

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ కార్యకలాపాలకై 2025–26 విద్యా సంవత్సరానికి స్టూడెంట్ యాక్టివిటి సెంటర్ (ఎస్ఏసీ) కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వీసీ యువరాజ్ శుక్రవారం తెలిపారు. ఎస్ఏసీ ప్రెసిడెంట్‌గా వి. హర్షవర్ధన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా జయరాంరెడ్డి, సెక్రటరీగా మహేష్, జాయింట్ సెక్రటరీగా కృపాంజలి, ట్రెజరర్‌గా అఖిలేశ్వరి నియమితులైనట్లు తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల్లో నాయకత్వం, సృజనాత్మకత, సహకారం పెంపొందుతుందని తెలిపారు. యూనివర్సిటీలో విద్యార్థుల నేతృత్వంలోని క్లబ్‌లు, కౌన్సిల్‌లు, సాంస్కృతిక, సాంకేతిక, సామాజిక కార్యక్రమాలను సమన్వయం చేయడం, ఆపై పర్యవేక్షించే కేంద్ర సంస్థగా ఇది పనిచేస్తుందన్నారు.



ఎస్ఏసీ లీడర్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్లు

29న మున్సిపల్ కౌన్సిల్ మీట్

మదనపల్లె: మదనపల్లె మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 29 సోమవారం నిర్వహించనున్నారు. దీనితో కొన్ని కీలకమైన అంశాలపై సమీక్షించడంతో పాటు మాస్టర్‌ప్లాన్ ప్రకారం పనులు చేస్తారా లేక ధిక్కరిస్తారా అన్నదానిపైనే ప్రధాన చర్చ సాగనుంది. సమావేశానికి సంబంధించి అజెండా ఆమోదం తెలపాలని కోరుతూ అధికారులు సిద్ధం చేసిన ప్రధాన అంశాలపై కౌన్సిల్ దృష్టి పెట్టింది. గత సమావేశాల్లో అధికారులు పెట్టిన అజెండా అంశాల్లో కీలకమైన రెండింటిపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆమోదం వాయిదా పడింది. మళ్లీ ఇవే అంశాలను అజెండాలో పెట్టడంతో వాడీ, వేడిగా చర్చించి అధికారుల తీరును ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సిద్ధమవుతున్నారు.

ఒకబోరుకు రూ.12 లక్షలా ?

పట్టణంలో తొమ్మిదిచోట్ల నీటికోసం బోర్ల తవ్వకం, ఇతరాపనులకు టెండర్లు నిర్వహించారు. ఇందులో ఒకబోరువేసి, మోటార్,వైర్లు ఏర్పాటు కోసం రూ.12.56 లక్షలు పేర్కొన్నారు. ఒకబోరుకు ఇంత ఖర్చు ఎలా వస్తుంది అనే అనుమానం కౌన్సిల్ వ్యక్తం చేస్తోంది. దీనితో ఈ పనులు గతంలో ఎక్కడెక్కడె జరిగాయి, ప్రస్తుతం వేయనున్న బోర్లు, వాటి ఖర్చుపై ఆరా తీస్తున్నారు. ఈ అంశంతోపాటు మరికొన్ని అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించనున్నారు. ఈనెల 29న సోమవారం మున్సిపల్ కౌన్సిల్ మీట్ నిర్వహిస్తున్నట్టు చైర్మన్ వరపన మనూజ రెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు అందరూ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం